విద్యాశాఖలో ముదిరిన వివాదం





వర్షాల కోసం ప్రత్యేక పూజలు

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in





ఆర్మూర్ పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్‌లో శనివారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఒకరికి ఒకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లను కట్టుకుని శుభాకాంక్షలు చెప్పకున్నారు. – అక్షరటుడే, ఆర్మూర్



## రేపు శివాజీనగర్ మున్నూరుకాపు సంఘంలో మెగా వైద్యశిబిరం



**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని శివాజీనగర్ మున్నూరు కాపు సంఘంలో మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు రామర్తి గోపి తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. శివాజీనగర్ మున్నూరుకాపు సంఘంలో ఆదివారం ఉదయం 8 గంటలకు వైద్యశిబిరం ప్రారంభమవుతుందన్నారు. ఇందులో భాగంగా ఉచితంగా రక్తపరీక్షలు, ఈసీజీ, డాక్టర్ కన్సల్టేషన్, షుగర్ పరీక్షలు చేస్తారని వివరించారు. అవసరమైన వారికి మందులు సైతం ఉచితంగా అందజేస్తామని ఆయన పేర్కొన్నారు. వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.


## పసుపు పరిశోధన కేంద్రం కోసం ఎంతో శ్రమించాం



**అక్షరటుడే, భీమ్‌గల్:** కమ్మర్‌పల్లిలో పసుపు పరిశోధన కేంద్రం కోసం ఎన్నో పోరాటాలు చేశామని రైతు నాయకుడు కోటపాటి నర్సింహ నాయుడు పేర్కొన్నారు. కమ్మర్‌పల్లిలోని పరిశోధన కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2007లో ఢిల్లీలో రైతులతో ధర్నా నిర్వహించి అప్పటి కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శరత్ పవర్‌ను కలిసి విన్నవించామన్నారు. ఆయన చొరవతో పసుపు పరిశోధన కేంద్రం మంజూరైందన్నారు. అనంతరం కమ్మర్‌పల్లిలో 36 ఎకరాల్లో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు 350 ఎకరాల్లో పసుపు రకాలను పండిస్తూ రైతులకు ప్రయోజనకరమైన రీతిలో అధిక కర్కుమిన్ రకాలను సాగు చేస్తున్నారని కోటపాటి వివరించారు. ఆయన వెంట కొక్కుల విద్యాసాగర్, రుక్మాజీలున్నారు.

**ఉమ్మడి జిల్లాలో టీచర్ల పదోన్నతుల సందడి నెలకొంది. కొన్నేళ్లుగా టీచర్లు ప్రమోషన్ల కోసం డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఉపాధ్యాయుల ప్రమోషన్లకు ఇటీవల గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. దీంతో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లోని విద్యాశాఖ కార్యాలయాల్లో సందడి నెలకొంది. అధికారులు పదోన్నతుల ప్రక్రియను ప్రారంభించారు. మూడు రోజులుగా ప్రమోషన్ల కోసం కసరత్తు చేస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి కల్పించనున్నారు.**

– అక్షరటుడే, ఇందూరు



# ఉపాధ్యాయుల పదోన్నతుల సందడి

▸ కొనసాగుతున్న ప్రక్రియ ▸ ఎస్ఏలకు హెచ్ఎంలుగా ప్రమోషన్ ▸ ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

నిజామాబాద్ జిల్లాలో మొత్తం 238 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 11 ప్రభుత్వ ఉన్నత బడుల్లో, 175 జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు విధులు నిర్వర్తిస్తున్నారు. మరో 52 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటిలో లోకల్ బాడీ పాఠశాలలు 42, ప్రభుత్వ పాఠశాలలు 10 ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించి వీటిని భర్తీ చేయనున్నారు. 2002 డిసెంబర్ నుంచి 2005 డిసెంబర్ మధ్య నియమితులైన వారికి పదోన్నతి లభించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

### కామారెడ్డిలోనూ..

కామారెడ్డి జిల్లాలో నూ ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. జిల్లా వ్యాప్తంగా ఉన్న 165 మంది స్థానిక సంస్థల, జిల్లా పరిషత్ స్కూల్ అసిస్టెంట్లు హెచ్ఎంలుగా పదోన్నతులు పొందన్నారు. వీరి స్థానంలో ఖాళీలను ఎస్జీటీల ద్వారా భర్తీ చేయనున్నారు.



### సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి

రెండు రోజులుగా నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో స్కూల్ అసిస్టెంట్ల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి చేశారు. శనివారం జిల్లాలో ఖాళీగా ఉన్న పీజీహెచ్ఎంల వివరాలను వెబ్‌సైట్‌లో ప్రదర్శించారు. సీనియారిటీ జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించి తుది జాబితా ప్రకటించారు. స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్ ప్రక్రియ ఈ నెల 12లోగా పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈ నెల 8, 9వ తేదీల్లో ఎస్జీటీల తుది జాబితా కూడా ప్రదర్శిస్తారు.

### ఎస్జీటీలకు..

స్కూల్ అసిస్టెంట్లకు పదోన్నతులు కల్పించడంతో.. వారి స్థానాలు ఖాళీ కానున్నాయి. ఆయా స్థానాలను ఎస్జీటీ ప్రమోషన్లతో భర్తీ చేయనున్నారు. సీనియారిటీ ప్రకారం 1:3 ప్రాతిపదికన ఎస్జీటీల ధ్రువపత్రాలను పరిశీలించారు. ఖాళీగా ఉన్న స్కూల్ అసిస్టెంట్ల పోస్టుల్లో ఎస్జీటీలకు పదోన్నతి కల్పించనున్నారు. జీవశాస్త్రంలో ఐదు, భౌతిక శాస్త్రం 10, సాంఘిక శాస్త్రం 12, ఆంగ్లం 11, జీవశాస్త్రం (ఉర్దూ) 2, గణితం (ఉర్దూ) ఒకటి, పీఎస్ హెచ్ఎం 17 పోస్టులను ఎస్జీటీ ప్రమోషన్లతో భర్తీ చేయనున్నారు.

## రెండు మండలాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

**అక్షరటుడే, ఇందల్వాయి :** ధర్పల్లి, ఇందల్వాయి మండలాల్లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి శనివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ధర్పల్లి మండలం ఒన్నాజిపేట్‌లోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ సెంటర్, ఎరువుల గోడౌన్లను కలెక్టర్ సందర్శించారు. ఇందల్వాయి మండలంలోని ఎల్లారెడ్డిపల్లిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను, సహకార సంఘం ఎరువుల గిడ్డంగిని తనిఖీ చేశారు. పాఠశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం ద్వారా చేపడుతున్నారా అని ఆరా తీశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఎరువుల గిడ్డంగుల్లో అందుబాటులో ఉన్న నిల్వలు స్టాక్ రిజిస్టర్‌లోని వివరాలకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ, ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్ రజితను ఆదేశించారు. ఎల్లారెడ్డిపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతీ కార్యదర్శి సంధ్యారాణిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అధికారులు ఉన్నారు.

## నిజాంసాగర్‌లో ఎకో టూరిజం అభివృద్ధికి రూ.9.98 కోట్ల నిధులు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**అక్షరటుడే, కామారెడ్డి:** నిజాంసాగర్ జలాశయం ఎకో టూరిజం అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం టూరిజం కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. జలాశయం వద్ద ఎకో టూరిజం అభివృద్ధికి రూ.9.98 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. స్వదేశ్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా టూరిజం అభివృద్ధికి నిధులు మంజూరయ్యాయని కలెక్టర్ తెలిపారు. జలాశయం వద్ద ఇప్పటికే 12.30 ఎకరాల భూమిని ఎకో టూరిజం అభివృద్ధికి సేకరించినట్లు పేర్కొన్నారు. గుర్తించిన స్థలంలో వెంటనే భూమి చదును చేయడం, పిచ్చి మొక్కల తొలగింపు చేపట్టాలన్నారు. పనులు త్వరగా పూర్తి చేసి ఎకో టూరిజం అభివృద్ధిలో భాగంగా డీలక్స్ రూములు, సూట్ రూములు, స్పా, యోగా సెంటర్, రెస్టారెంట్, డార్మెటరీ, మెయిన్ ఎంట్రెన్స్ ఆర్చ్, థీమ్ గార్డెన్‌తో పాటు చిన్న పిల్లల ఆటస్థలం నిర్మాణాల కోసం శంకుస్థాపనకు సిద్ధం చేయాలని టూరిజం కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టూరిజం కార్పొరేషన్ డీఈ విద్యాసాగర్, ఏఈ సోహెల్, జిల్లా టూరిజం అధికారి జగన్నాథం పాల్గొన్నారు.

# ఆర్మూర్‌లో మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

▸ స్వాగతం పలికిన పార్టీ శ్రేణులు
▸ పాల్గొన్న ప్రముఖ నాయకులు

**అక్షరటుడే, ఆర్మూర్:** కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర ఆర్మూర్‌లో ప్రారంభమైంది. శనివారం సాయంత్రం ఆమె ఆర్మూర్‌కు చేరుకున్నారు. ముందుగా ఆలూర్ బైపాస్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. అనంతరం మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. పాదయాత్ర ఆలూరు బైపాస్ నుంచి ప్రారంభమైంది. దారిపొడవున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ప్రజల నుంచి ఆమె వినతులు స్వీకరిస్తూ.. సమస్యలు వింటూ ముందుకు సాగారు. పాదయాత్ర పెద్ద బజార్, గోల్ బంగ్లా, అంబేద్కర్ చౌరస్తా, కొత్త బస్టాండ్, మామిడిపల్లి చౌరస్తా మీదుగా పెర్కిట్ చౌరస్తా వరకు సాగింది. కార్యక్రమంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, మదన్ మోహన్‌రావు, లక్ష్మీకాంతారావు, కార్పొరేషన్ ఛైర్మన్లు మానాల మోహన్ రెడ్డి, కాసుల బాలరాజ్, కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





లబ్ధిదారులకు రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న షబ్బీర్ అలీ

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

**అక్షరటుడే, కామారెడ్డి:** పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ, హరిజన వాడలో శనివారం ఆయన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని షబ్బీర్ అలీ అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే అర్హులైన పేదలకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. లబ్ధిదారులకు సన్నబియ్యాన్ని అందజేస్తున్నామన్నారు. పేదల కళ్లలో ఆనందం చూడడం కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఏనాడైనా పేదల సంక్షేమాన్ని పట్టించుకుందా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ డిక్లరేషన్‌కు తాము కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బిల్లు ఆమోదం కోసం గవర్నర్ వద్దకు పంపించామని, బీసీ రిజర్వేషన్ ప్రకారం రాబోయే ఎన్నికలు జరుగుతాయని తెలిపారు.







# ఘనంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలు

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నల్గొండ ఎమ్మెల్సీ శంకర్ నాయక్, రాష్ట్ర సహకార యూనియన్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, నుడా ఛైర్మన్ కేశవేణు, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ అంత రెడ్డి రాజారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ నగేష్ రెడ్డి, రత్నాకర్, విపుల్ గౌడ్ పాల్గొన్నారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులతో కలిసి వేడుకలు జరుపుకున్నారు.

బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి జన్మదినం సందర్భంగా పీసీసీ డెలిగేట్ విజయ్‌పాల్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. సుదర్శన్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి విషెస్ చెప్పారు.


# విద్యాశాఖలో ముదిరిన వివాదం..

**▸ రెండు రోజులుగా హాజరు సంతకాలు పెట్టని ఉద్యోగులు! ▸ డీఈవో స్పందించాలని వేడుకోలు**

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో రోజురోజుకు వివాదం ముదురుతోంది. ఓ జూనియర్ అసిస్టెంట్ వ్యవహార శైలి సరిగ్గా లేదంటూ కొన్ని రోజులుగా ఉద్యోగులంతా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. డీఈవోతో పాటు టీఎన్జీవోస్ అధ్యక్షుడు, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సదరు ఉద్యోగిని జిల్లాలోని ఏదైనా పాఠశాలకు పంపాలని కోరారు.

### సిబ్బంది మొత్తం ఏకతాటిపై..

జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సుమారు 36 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే ఓ జూనియర్ అసిస్టెంట్ తరచూ ఇతరులతో గొడవలకు




దిగడం, తనకు ఆదాయం ఉన్న సెక్షన్ కేటాయించాలని ఒత్తిడి తేవడం, ప్రైవేటు పాఠశాలల్లో వసూళ్లకు పాల్పడడం, అంతర్గత సమాచారాన్ని ఇతరులకు పంపడం వంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై కార్యాలయంలోని మిగతా 36 మంది ఏకతాటిపై నిలబడి పలుసార్లు డీఈవోకు ఫిర్యాదు చేశారు. విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు సమాచారం.

### సంతకాలు చేయని వైనం..

సదరు జూనియర్ అసిస్టెంట్ వ్యవహార శైలితో తామంతా ఇబ్బందులు పడుతున్నామని ఉద్యోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో శుక్ర, శనివారం హాజరు పట్టికలో సంతకాలు కూడా చేయలేదని తెలిసింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని డీఈవోకు చెప్పినా పట్టించుకోవడం లేదని కార్యాలయ ఉద్యోగులు వాపోతున్నారు.

## చంద్రాయన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈవో



**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని చంద్రాయన్‌పల్లి గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను శనివారం ఎంఈవో శ్రీధర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనం బాగా పెడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మంచి విద్యతో పాటు నాణ్యమైన భోజనాన్ని అందించాలని పాఠశాల సిబ్బందికి సూచించారు. మధ్యాహ్న భోజన కార్మికులతో మాట్లాడి రుచికరమైన వంట చేసి విద్యార్థులకు అందించాలన్నారు. ప్రభుత్వం పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లలో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి



**అక్షరటుడే, బోధన్ :** పట్టణంలోని వివిధ హాస్టళ్లను మున్సిపల్ కమిషనర్ కృష్ణ జాదవ్ పరిశీలించారు. శనివారం ఉదయం అల్పాహార సమయంలో పట్టణ పరిధిలో గల ఎస్సీ బాలికల హాస్టళ్లను, అదేవిధంగా బీసీ బాలికల హాస్టళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా అల్పాహారాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని సిబ్బందికి సూచించారు. హాస్టల్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పరిసరాలు శుభ్రంగా ఉంచకపోతే చర్యలు తప్పవని కమిషనర్ సిబ్బందిని హెచ్చరించారు. కమిషన్ వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేశ్ సీవో సంతోష్, జవాన్లు కిషోర్ తదితరులున్నారు.



## మహంతం శివారులో చిరుత కలకలం..

**అక్షరటుడే, బోధన్:** నవీపేట మండలంలో చిరుత కలకలం సృష్టించింది. మహంతం శివారులో ఓ దూడపై దాడి చేసి హతమార్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహంతం శివారులో ఓ పొలంలోని షెడ్‌లో రైతు దూడను కట్టేయగా శుక్రవారం అర్ధరాత్రి వేళ చిరుత దాడి చేసింది. సమాచారం అందుకున్న అటవీశాఖాధికారులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిరుతదాడి ఆనవాళ్లను పరిశీలించారు. మహంతంలో చిరుత ఆనవాళ్లు కనిపించడంతో రైతులు భయాందోళనకు గురయ్యారు. పొలాలకు వెళ్లేందుకు భయపడే పరిస్థితి వచ్చిందని వారు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి దూడపై దాడి చేసిన ఘటన కారణంగా పొలల్లో పనులకు వెళ్లడం లేదని వారు పేర్కొన్నారు.

## తాళం వేసిన రెండిళ్లలో చోరీ

**అక్షరటుడే, బాన్సువాడ:** బీర్కూర్ మండల కేంద్రంలో తాళాలు వేసిన రెండిళ్లలో దుండగులు దొంగతనానికి పాల్పడ్డారు. బాధితులు సాయవ్వ, విజయలక్ష్మి ఇళ్లకు తాళాలు వేసి వేరే గ్రామాలకు వెళ్లారు. తాళాలు వేసిన ఇళ్లను గమనించిన దుండగులు దొంగతనానికి పాల్పడే సమయంలో పక్కన ఇళ్లకు బయట నుంచి గొల్లాలు పెట్టి మరీ దొంగతనానికి పాల్పడ్డారు. సాయవ్వ ఇంట్లో రూ. రెండు వేలు, విజయలక్ష్మి ఇంట్లో రూ. 20 వేలు దొంగతనం జరిగినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ఒకే రోజు రెండిళ్లలో చోరీ జరగడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.



## అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత



**అక్షరటుడే, నిజాంసాగర్:** పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం బిచ్కుంద మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. కోడిగుడ్లు, కూరగాయల బిల్లులు రాకపోవడంతో అప్పులు తెచ్చి విద్యార్థులకు భోజనం అందిస్తున్నామన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, వంట గదులు నిర్మించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.10 వేల వేతనం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు సురేష్ గొండ, భోజన పథకం కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సరస్వతి, మద్నూర్, డోంగ్లీ, బిచ్కుంద, జుక్కల్, మండలాల నాయకులు సావిత్రి, వచల బాయి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ చేతుల మీదుగా గోల్డ్‌మెడల్ ప్రదానం



**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడ పట్టణానికి చెందిన విద్యార్థిని సోమనగారి వర్షిణి గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ పరిధిలోని రుద్రూర్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఈ ఏడాది అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన సందర్భంగా ఆమె గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా గవర్నర్ శనివారం ఆమెకు మెడల్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం విద్యార్థినికి అభినందనలు తెలియజేశారు.



## అల్లుకున్న నిర్లక్ష్యం..

**భీమ్‌గల్ పట్టణంలోని కుప్కల్ రోడ్డులో శ్మశాన వాటిక పక్కన విద్యుత్ స్తంభాన్ని పిచ్చిమొక్కలు పూర్తిగా అల్లుకున్నాయి. ఈ తీగలు విద్యుత్‌తీగలకు కూడా పాకాయి. దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ సిబ్బంది స్పందించి వెంటనే ముళ్లపొదలను తొలగింపజేయాలని వారు కోరుతున్నారు.**

**– అక్షరటుడే, భీమ్‌గల్**

## చంద్రాయన్‌పల్లిలో అమర జవాన్ విగ్రహావిష్కరణ

**అక్షరటుడే, ఇందల్వాయి:** తన కుమారుడు సైన్యంలో చేరి దేశసేవలో ఉన్నాడని నలుగురికీ గర్వంగా చెప్పుకుంది ఆ తల్లి.. కానీ విధి మాత్రం అనారోగ్యం రూపంలో జవాన్‌ను కబలించింది. దీంతో తన కుమారుడి జ్ఞాపకార్థం నలుగురి సాయంతో విగ్రహాన్ని తయారుచేయించి ఆ మాతృమూర్తి ఆవిష్కరించింది. వివరాల్లోకి వెళ్తే.. అమరవీరుడు ఆర్మీ జవాన్ చెవుల ప్రశాంత్ యాదవ్ విగ్రహాన్ని ఆయన మాతృమూర్తి నర్సవ్వ శనివారం ఆవిష్కరించారు. ఇందల్వాయి మండలంలోని చంద్రాయన్ పల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్ యాదవ్ సైన్యంలో చేరి తొమ్మిదేళ్లు దేశానికి సేవలందించాడు. 2023 ఆగస్టు 28న విధుల్లో ఉండగానే అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు. చంద్రాయన్ పల్లి గ్రామపంచాయతీ ఆవరణలో జవాన్ కుటుంసభ్యులు, ఆర్మీ జవాన్లు, గ్రామపెద్దల సహకారంతో ప్రశాంత్ యాదవ్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శనివారం విగ్రహాన్ని ఆయన తల్లి ఆవిష్కరించారు. విగ్రహవిష్కరణ సందర్భంగా ప్రశాంత్‌యాదవ్ విగ్రహానికి ఆయన కుమారుడు పాలాభిషేకం చేశాడు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సమయంలో ప్రశాంత్ తల్లి, భార్య కన్నీళ్లు పెట్టుకోవడంతో గ్రామస్థులు ఓదార్చారు. ప్రశాంత్ సోదరుడు ప్రవీణ్ మాట్లాడుతూ దేశ సేవ కోసం ఆర్మీలో చేరిన తన అన్న ప్రశాంత్ యాదవ్ బ్రెయిన్ ట్యూమర్‌తో విధుల్లో ఉండగానే మరణించాడని.. దేశ సేవలో ఆయన అమరుడవ్వడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు, ఆర్మీ జవాన్లు సంతోష్, ప్రశాంత్, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


ప్రశాంత్ యాదవ్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న సతీమణి



## పాఠశాలలో ఆరోగ్య శిబిరం

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో తిర్మన్ పల్లి తెలంగాణ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి క్రిస్టినా విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల హెచ్ఈవో శంకర్, హెల్త్ సూపర్ వైజర్ అక్బర్ అలీ, ఆరోగ్య కార్యకర్త శారద, భానుప్రియ, ఆశా కార్యకర్తలు ప్రమీల, జ్యోతి, ప్రియాంక పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు



**అక్షరటుడే, నిజాంసాగర్:** ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణాలను చేపట్టాలని కాంగ్రెస్ పిట్లం మండల అధ్యక్షుడు హన్మాండ్లు సూచించారు. మండలంలోని తిమ్మానగర్ తండాలో శనివారం పలువురు లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. లబ్ధిదారులకు డబ్బులు విడతల వారీగా జమ అవుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూరత్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పండరి రాజు రాథోడ్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం




**అక్షరటుడే, నిజాంసాగర్:** పిట్లం ప్రభుత్వ ఆస్పత్రిలో శనివారం జిల్లా అంధత్వ సంస్థ, లయన్స్ క్లబ్ ఆఫ్ పిట్లం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ రావు సుమారు 58మందిని పరీక్షించారు. అందులో ఎనిమిది మందిని బోధన్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఒకరిని హైదరాబాద్ సరోజిన దేవి కంటి ఆస్పత్రికి పంపారు. మరో 25మందికి కంటి సమస్యలను గుర్తించి అద్దాలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి బాలు, కిషన్, లక్ష్మీనారాయణ, పూర్వాధ్యక్షుడు కాశిరెడ్డి, అశోక్, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి

**అక్షరటుడే, బాన్సువాడ :** ప్రేమ పేరుతో బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన దళిత మహిళను మోసం చేసిన నత్ర సాయిలును అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి మంతని సామ్యేల్ డిమాండ్ చేశారు. శనివారం బాధిత మహిళ ఇంటికి వెళ్లి మద్దతు తెలిపారు. ప్రేమ పేరుతో మోసం చేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామన్నారు. ఆయన వెంట నాయకులు పెద్దారం గంగారాం, శివరాజ్, బొజ్జ సాయిలు ఉన్నారు.


భీమ్‌గల్‌లో పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు



నగరంలో బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

## బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్‌లు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ/ భీమ్‌గల్:** జిల్లాలో పలువురు బీఆర్ఎస్ నాయకులను ముందస్తు అరెస్ట్‌లు చేశారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న నిరాహార దీక్షకు వెళ్లకుండా పోలీసులు పలువురు బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుని ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. నగరంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యప్రకాశ్, సుజిత్ సింగ్ ఠాకూర్, నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సిర్పరాజు, అగ్గు సంతోష్, చింతకాయల రాజు, సదానంద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ లీగల్ సెల్ కన్వీనర్ మధుసూదన్ రావు, కోకన్వీనర్ పులి జైపాల్ మాట్లాడుతూ..రాష్ట్రంలో పోలీసు పాలన సాగుతోందన్నారు. భీమ్‌గల్‌లోనూ బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.


నుడా మాజీ ఛైర్మన్..





# సిద్ధులు నడయాడిన నవనాథగిరి..!

■ ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న సిద్దులగుట్ట ■ శ్రావణంలో భారీగా తరలివస్తున్న భక్తులు ■ సినిమా షూటింగ్‌లకూ అనుకూలం

**సిద్ధులు నడయాడిన నేల నవనాథగిరి ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది. నవనాథ సిద్ధుల గుట్టగా కీర్తికెక్కిన ఆధ్యాత్మిక క్షేత్రం ప్రకృతి రమణీయతతో పాటు భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధికెక్కింది. కపిలవనంలో కళకళలాడే సిద్ధుల గుట్ట ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడింది.**

**– అక్షరటుడే, ఆర్మూర్**

శతాబ్దాల కిందట లోక కల్యాణార్థం నవనాథ సిద్ధులు (తొమ్మిది మంది రుషులు) గోరఖ్‌నాథ్, జలంధర్ నాథ్, చతపట్ నాథ్, ఆడ బంగనాథ, కాణిపానాథ్, మచ్చేందర్ నాథ్, చౌరంగి నాథ్, రేవన్ నాథ్, భర్తేరీనాథ్ దేశమంతా సంచరిస్తూ ఆర్మూర్‌కు చేరుకున్నారని ప్రతీతి. అప్పట్లో ఈ గ్రామం చుట్టూ విశాలమైన కొండ ఉండడంతో ఇక్కడి కొండ గుహల్లో తపస్సు చేసుకునేందుకు ఎంచుకున్నారు. కొండ గుహల్లో శివలింగం, సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించి పూజించినట్లు పురాణగాథ. ఏళ్ల పాటు నవనాథ సిద్ధులు ఇక్కడే ఉండి తపస్సు చేశారని ఆ తర్వాత కొంతకాలానికి ఆరుగురు సిద్ధులు వెళ్లి పోగా, ముగ్గురు ఆర్మూర్‌లోనే ఉండిపోయారని ప్రాచీన గాథ. ఆరు, మూడు అని కాలక్రమంలో ఆరు, మూరుగా, అనంతరం ఆర్మూర్‌గా వాడుకలోకి వచ్చిందని ప్రసిద్ధి. అలాగే నవనాథ సిద్ధులు తపస్సు చేసిన ప్రదేశం కావడంతో నవనాథపురంగా ప్రాచుర్యం పొందింది.

### కొండల మధ్య ఆలయాలు..

ప్రకృతి రమణీయతకు ఆలవాలమైన నవనాథ సిద్ధుల గుట్ట ఆర్మూర్‌కు మణిహారంగా నిలిచింది. నల్లని కొండ రాళ్లతో సుమారు రెండు కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 300కు పైగా మెట్లు ఎక్కి సిద్ధులు ప్రతిష్ఠించిన సీతారాములు కొండగుహలోని శివలింగాన్ని దర్శించుకుంటారు. ఆర్మూర్ గ్రామపంచాయతీ సమయంలో సర్పంచ్ హండే సిద్ధులగుట్టకు సింగిల్ రోడ్డుతో ఘాట్ రోడ్డు వేయించారు. అటు తర్వాత ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి హయాంలో రూ.20 కోట్ల వ్యయంతో పాత ఘాట్ రోడ్డు తొలగించి విశాలమైన ఘాట్‌రోడ్డు నిర్మించడంతో పాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించారు. గుట్టపై చిల్డ్రన్స్ పార్క్, మరుగుదొడ్లు, గోశాల నిర్మించారు. ఇప్పటికీ పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ప్రతి సోమవారం స్వామివారి పల్లకీ సేవా, భక్తుల కోసం అన్నదానం నిర్వహిస్తున్నారు. శ్రావణమాసం కావడంతో సిద్ధుల గుట్టపై ఒకే దగ్గర రామాలయం, శివాలయంతో పాటు పలు దేవాలయాలు ఉండటంతో భక్తులు అధికసంఖ్యలో వస్తుంటారు.

### షూటింగ్‌లకు అనుకూలం..

నవనాథ సిద్ధుల గుట్ట ఆధునిక శోభతో పాటు పర్యాటక కేంద్రంగా మారింది. గుట్టపై సినిమా షూటింగ్‌లు సైతం జరుగుతున్నాయి. హీరో నాగచైతన్య నటించిన లవ్ స్టోరీ సినిమా ఇక్కడే జరిగింది. ఇటీవల విడుదలైన సప్తగిరి నటించిన పెళ్లికాని ప్రసాద్ సినిమాలోని పలు సన్నివేశాలు సిద్దులగుట్టపై చిత్రీకరించారు. తెలంగాణ జానపద గేయాల నృత్యాలు సిద్దులగుట్టపైనే చిత్రీకరిస్తున్నారు.

## ఎండీఎం కార్మికుల బకాయి బిల్లులను చెల్లించాలి




**అక్షరటుడే, బాన్సువాడ:** ఎండీఎం కార్మికుల బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దుబాస్ రాములు డిమాండ్ చేశారు. బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మధ్యాహ్న భోజన పథకం వర్కర్లు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మొత్తం బిల్లులు కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.పది వేలు గౌరవ వేతనం ఇస్తామని ఎన్నికల హామీ ఇచ్చిందన్నారు. కానీ ప్రస్తుతం హామీని మరిచిపోయిందని ఆయన దుయ్యబట్టారు. శిథిలావస్థలో ఉన్న వంటశాలలను నిర్మించాలని, వంట పాత్రలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బాన్సువాడ డివిజన్ సెక్రెటరీ శంకర్, అంజవ్వ, సుజాత, నాగమణి, లక్ష్మి, నజిమాబి, చియా బేగం, సోఫియా బేగం, మంద శంకర్, సాయిలు, పాషా తదితరులు పాల్గొన్నారు.

## అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి



**అక్షరటుడే, ఇందూరు:** అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ బ్రిజేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే బదిలీలు, కెరీర్ అడ్వాన్స్ స్కీం తదితర సమస్యలను పరిష్కరించామని వివరించారు. అనంతరం ఆయనను అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి, అధ్యాపకులు దండు స్వామి, రంగరత్నం, భరత్‌రాజ్, ముత్తెన్న, రాజేష్, చంద్రశేఖర్, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రసంగాన్ని వీక్షించిన రైతులు



**అక్షరటుడే, బాన్సువాడ:** ప్రధాని నరేంద్ర మోదీ వారణాసిలో పీఎం కిసాన్ 20వ విడత ఆర్థిక సహాయం నిధులు విడుదలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నస్రుల్లాబాద్ మండలంలోని మిర్జాపూర్ క్లస్టర్ రైతు వేదికలో ప్రత్యక్ష ప్రసారం కార్యక్రమం నిర్వహించారు. ఏఈవో గ్రీష్మ ఆధ్వర్యంలో బీజేపీ కార్యకర్తలు, నాయకులు, రైతులు ప్రధాని మోదీ ప్రసంగాన్ని వీక్షించారు. అనంతరం మిర్జాపూర్ క్లస్టర్ కు ఇటీవల బదిలీపై వచ్చిన ఏఈవోను నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సున్నం సాయిలు, సంతోష్, శ్రీనివాస్, అరిగె నారాయణ పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంలాంటివి..



**అక్షరటుడే, నిజాంసాగర్:** తల్లిపాలు అమృతమని.. బిడ్డకు చాలా ఉపయోగకరమని బంజారాహిల్స్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త విజయలక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ప్రసవమైన వెంటనే ముర్రు పాలు బిడ్డకు పట్టాలని గర్భిణులకు సూచించారు. పుట్టిన వెంటనే ఆర్నెళ్లపాటు తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలతో పాటు ఆరోగ్య కార్యకర్త ఫర్హానా, ఆశ కార్యకర్త పార్వతి ఉన్నారు.

### బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానం



**అక్షరటుడే, నిజాంసాగర్:** బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని సీ డీ పీ ఓ సౌభాగ్య అన్నారు. మహమ్మద్ నగర్ మండలంలోని తెల్గాపూర్, సంగీతం, షెర్ ఖాన్ పల్లిలోని అంగన్వాడీ కేంద్రాల్లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె పాల్గొని బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యతపై వివరించారు. ముందుగా కేంద్రానికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల హాజరు, పౌష్టికాహారం మెనూ వివరాలు పరిశీలించారు. పుట్టిన బిడ్డకు ముర్రు పాలు తాగించాలని సూచించారు. ప్రతి గర్భిణి మూడు నెలల్లోపు అంగన్వాడీలో తమ పేరు నమోదు చేయించుకుని, ప్రసవం తరువాత ఆరు నెలలవరకు అంగన్వాడీలో అందజేసే పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. పుట్టిన ప్రతి బిడ్డకి బీసీజీ ఇంజక్షన్ వేయించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్తలు గంగామణి, స్వప్న, కిష్టమ్మ, సాయవ్వ, గర్భిణీలు, బాలింతలు, తదితరులు ఉన్నారు.

## ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి



**అక్షరటుడే, ఇందూరు:** ప్రతి ఇంట్లో, పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ కమిషనర్ రవిబాబు సూచించారు. నగరంలోని నిర్మల హృదయ పాఠశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీ మాట్లాడుతూ.. ఇంటి ఆవరణలో ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా చూడాలన్నారు. వ్యర్థాల వల్ల కలిగే అనర్థాలను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ప్రధానంగా ఇంటికి వచ్చే చెత్త సేకరణ వాహనాల్లో మాత్రమే వేయాలని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలని చెప్పారు. ప్లాస్టిక్ వాడకంతో అనారోగ్యాలపాలయ్యే అవకాశం ఉందని డీసీ సూచించారు. ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించి ప్రకృతిని కాపాడాలన్నారు. తిను పదార్థాలను కవర్లలో నిల్వ చేయద్దని సూచించారు. విద్యార్థులు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలను తెలుసుకుని ఇతరులకు వివరించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ పేరుతో హింసాత్మక రాజ్యం



**అక్షరటుడే, ఆర్మూర్:** ఇందిరమ్మ పేరుతో తెలంగాణలో హింసాత్మక రాజ్యం సాగుతోందని ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ పాదయాత్ర సందర్భంగా జిల్లావ్యాప్తంగా వందలాది మంది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను అక్రమంగా నిర్బంధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఆర్మూర్‌లో తన ఇంటి చుట్టూ, నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయాల చుట్టూ పోలీసులను మోహరించడం దారుణమన్నారు. ఆర్మూర్ పేరు చెబితేనే రైతులు గుర్తొస్తారని.. అలాంటి రైతులను అక్రమంగా అరెస్ట్ చేయడం ఏమిటని జీవన్ రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తోందన్నారు. పాదయాత్ర చేస్తున్న మీనాక్షి నటరాజన్‌ను ఆరు గ్యారెంటీలు, 420 హామీలపై ప్రజలు ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. పోలీసులు అరెస్టు చేసిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వర్షాలు కురవాలని అంజన్నకు పూజలు




**అక్షరటుడే, నిజాంసాగర్:** వర్షాలు కురవాలని వేడుకుంటూ మండలంలోని మంగుళూరు గ్రామస్థులు శనివారం అంజనాద్రి క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు 21 గ్రామాల్లోని 21 ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం బ్రాహ్మణపల్లి అంజనాద్రి క్షేత్రానికి బైక్‌పై ర్యాలీగా చేరుకున్నారు. వర్షాలు కురవాలని.. ప్రజలు సుఖశాంతులతో ఉండాలని వారు మొక్కులు తీర్చుకున్నారు.

### మంగుళూరులో బతుకమ్మ ఆట

వర్షాలు కురవాలని మంగుళూరులో మహిళలు బతుకమ్మ ఆడారు. వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని ప్రధాన చౌరస్తా వద్ద నిండు నీటి బిందెను ఉంచి దాని చుట్టూ మహిళలు బతుకమ్మ ఆడారు. వర్షాలు బాగా కురవాలని వేడుకున్నారు.



## వర్షం కోసం గుర్రంపై దేవుని ఎదుర్కోలు



**అక్షరటుడే, గాంధారి:** వర్షాలు సమృద్ధిగా కురవాలని మండలంలోని గౌరారం గ్రామంలో రైతులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏటా ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం.. శ్రావణమాసంలో రెండో శనివారం వీరపురం హనుమాన్ మందిరం నుంచి గౌరారం హనుమాన్ మందిరం వరకు గుర్రం మీద దేవుని ఎదుర్కోలు నిర్వహించారు. ఇలా చేస్తే వర్షాలు సకాలంలో కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండుతాయని రైతులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, రైతులు పాల్గొన్నారు.

## నూతన రేషన్ కార్డుల పంపిణీ



**అక్షరటుడే నిజాంసాగర్:** పెద్ద కొడప్‌గల్ మండలంలోని అంజనీ గ్రామంలో శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ వస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ఆదేశానుసారం అంజనీ గ్రామంలో కొత్తరేషన్‌కార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, డాక్టర్ సంజీవ్, నాందేవ్ పటేల్, సాయాగౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా పాఠశాలలో వైద్య శిబిరం



**అక్షరటుడే, నిజాంసాగర్:** మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో నిజాంసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు మండల వైద్యాధికారి రోహిత్ కుమార్ వైద్య పరీక్షలు చేశారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్ వైజర్ ఎలిజబెత్, ఆరోగ్య సిబ్బంది మధుసూదన్, సునీత, ప్రిన్సిపాల్ సరోజన పాల్గొన్నారు.